## క్లుప్తంగా

### నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

**మునగపాక:** మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 21 సచివాలయాల పరిధిలో 116 యూనిట్లకు బీసీ, ఈబీసీ, ఇతర కులాలకు సంబంధించి 628 దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తుదారులు ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయానికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### అధిక లోడుతో వెళ్తున్న లారీలకు జరిమానా

**మునగపాక:** ఎటువంటి అనుమతులు లేకుండా అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలకు జరిమానా విధించినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పూడిమడక రోడ్డులో మంగళవారం రాత్రి మునగపాక జంక్షన్ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా అధిక లోడుతో బండరాళ్లను తరలిస్తున్న మూడు లారీలను పట్టుకొని కేసు నమోదు చేసి, రూ.96 వేల జరిమానా విధించామన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా అధిక లోడుతో బండరాళ్లను తరలిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు.

### బాలల సంరక్షణ అందరి బాధ్యత

**అచ్యుతాపురం రూరల్ :** బాలల సంరక్షణ అందరి బాధ్యత అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ క్షేత్ర స్థాయి సభ్యురాలు కె.ఎల్.వి.రమ్య అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై బుధవారం మళ్ళవరం, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్న పిల్లలతో పనులు చేయించడం, భిక్షాటనపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటువంటి పిల్లలు ఎక్కడైనా తారసపడితే వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1098, 112కు ఫోన్ చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో మహిళా కానిస్టేబుల్ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షుడిగా ఉండి మరో 9 మందితో కూడిన కమిటీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మళ్ళవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఎం.జగన్నాథపురం సర్పంచ్ కొరెడ్ల బుల్లెమ్మ, మాజీ సర్పంచ్ కొరెడ్ల సూర్య ప్రకాష్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలు నివారించాలి

**ఎస్.రాయవరం:** బాల్య వివాహాలు రూపుమాపే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ సూచించారు. గ్రామ సచివాలయంలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలలను పనులకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చిందని, అవసరమైన వాటిని ఉపయోగించుకుని రక్షణ పొందాలన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కమిటీ నిత్యం పర్యవేక్షిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు, ఎంపీటీసీ బొండా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో పెళ్లిరాట

**మునగపాక:** మునగపాక సంతబయలు సీతారాముల పెళ్లిరాట మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేపచెట్టుకు పసుపు, కుంకుమ అద్ది ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 6న జరగనున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాట మహోత్సవంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

### ఉప్పవరంలో ఉపాధి హామీ పనులు ప్రారంభం

**అచ్యుతాపురం రూరల్ :** ఉప్పవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఉప సర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడీవో ఎరకయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

**మునగపాక:** చలివేంద్రాలు వేసవి కాలంలో ఎంతగానో దోహదపడతాయని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ మార్గంలో ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చలివేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. వీఆర్వో సురేష్, ఏఎన్ఎం దేవకి, వీఏఏ సింధూజ, శరకం రాము, ఆడారి గణేష్, సచివాలయ సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### శ్మశానవాటిక అభివృద్ధికి భూమి పూజ

**మునగపాక:** మండలంలోని తోటాడ శివారు గవర్ల అనకాపల్లి శ్మశానవాటిక అభివృద్ధికి ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి బుధవారం భూమి పూజ చేశారు. తన కోటా నుంచి రూ.3 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్టు ఎంపీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి, షేక్ ఇస్మాయిల్, దొడ్డి కోటేశ్వరరావు, పాలమరెట్టి మురళి, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ పక్కదారి!





- సబ్సిడీ గ్యాస్ బండ యథేచ్ఛగా వ్యాపార అవసరాలకు వినియోగం
- పట్టణంలో వాడుతున్న హోటళ్లు, స్వీట్ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, చిరు వ్యాపారులు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



రాయితీ వంట గ్యాస్ సిలిండర్ ఉపయోగిస్తున్న ఓ చిరు వ్యాపారి

**యలమంచిలి రూరల్:** గృహావసరాల గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. యథేచ్ఛగా వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యలమంచిలి పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా హోటళ్లు, స్వీట్ స్టాళ్లు, బేకరీలు, కర్రీ పాయింట్లు, టిఫిన్ సెంటర్లు, హాట్‌చాట్ బళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద చిరు వ్యాపారులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నారు. రాయితీ గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగాన్ని అరికట్టాల్సిన పౌర సరఫరాల శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ అక్రమ గ్యాస్ సిలిండర్ల దందా ప్రజల ప్రాణాలకే ముప్పు తెచ్చేదిలా పరిణమించినా సివిల్ సప్లయీస్ అధికారులు మామూళ్లకు ఆశపడి కిమ్మనడం లేదన్న విమర్శలున్నాయి. ఫలితంగా యలమంచిలి పట్టణంలో ఎప్పుడు అగ్ని ప్రమాదం రూపంలో ఏ విపత్తు సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

#### పెను ప్రమాదమే..

వాస్తవానికి రాయితీ గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వాడడం అత్యంత ప్రమాదకరం. ఈ వినియోగం పేలుడుకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. గ్యాస్ కంపెనీలు ఆయా నిబంధనలు, సురక్షిత ప్రమాణాల మేరకే డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్ల వినియోగాన్ని నిర్ధారిస్తున్నాయి. ఈ నిబంధనలు అతిక్రమిస్తే పేలుళ్లు సంభవించే ప్రమాదం లేకపోలేదని స్పష్టం చేస్తున్నాయి. వ్యాపార రంగాలకు వినియోగించే కమర్షియల్ సిలిండర్లకు వాడే రెగ్యులేటర్, పైప్, ఇతర సురక్షిత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు స్టౌవ్‌లు చిన్నవిగా రూపకల్పన జరుగుతాయి. అయితే హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర చిరు వ్యాపారాల్లోని పెద్ద స్టౌలకు డొమెస్టిక్ సిలిండర్లను బిగించి వాడకం ప్రమాదకరమేనంటున్నారు నిపుణులు. ఈ తరుణంలో అవి ఎప్పుడైనా పేలే అవకాశం ఉందంటున్నారు. పేలుడు సంభవిస్తే ఆస్తి నష్టమే కాదు.. పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణాలు కోల్పోవాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

#### ధరలో భారీ వ్యత్యాసం

14.2 కిలోల గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌ను సబ్సిడీపై కేంద్ర ప్రభుత్వం రూ.811 రూపాయలకు అందజేస్తోంది. కిలో గ్యాస్ ధర రూ.57.11లు కాగా వాణిజ్య అవసరాలకు సంబంధించిన కమర్షియల్ సిలిండర్లకు ఈ రాయితీ వర్తించదు. 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర రూ.1750.50 కిలో రూ.92.13. డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల మధ్య కిలోకు రూ.35.02 వ్యత్యాసం ఉంది. ఒక గ్యాస్ సిలిండర్‌పై సుమారుగా రూ.497 ఆదా అవుతోంది. దీంతో వ్యాపారులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగానికే ప్రాధాన్యతనిస్తూ పెద్ద ఎత్తున రాయితీ సిలిండర్లను దారి మళ్లిస్తున్నారు.

#### దర్జాగా రాయితీ సిలిండర్ల వినియోగం



కేంద్ర ప్రభుత్వం గృహావసరాలకు రాయితీపై సరఫరా చేస్తున్న గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారిపై దర్జాగా రాయితీ సిలిండర్లను ఉపయోగిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. డొమెస్టిక్ సిలిండర్లు వ్యాపారానికి వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్ నవీన్, గాంధీనగరం, యలమంచిలి

#### తనిఖీలు చేసి, చర్యలు తీసుకుంటాం..



పట్టణంలో వ్యాపార అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. త్వరలోనే పౌర సరఫరాల అధికారులతో తనిఖీలు చేయిస్తాం. రాయితీ గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు ఉపయోగించడం ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. వ్యాపార అవసరాలకు 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలి. దీనిపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. పెద్ద హోటళ్లలో కూడా రాయితీ సిలిండర్లను వాడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకుంటాం.

– కె.వరహాలు, తహసీల్దార్, యలమంచిలి

### ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పాటిపల్లిలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

**మునగపాక:** ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి కోరారు. మండలంలోని పాటిపల్లి అహోబిల నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉపాధి హామీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. వలసలను నివారించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆడారి త్రిమూర్తులు, భీశెట్టి ధనశ్రీను, ఉపసర్పంచ్ గంగునాయుడు, వార్డు సభ్యులు దాడి గంగరాజు, యల్లపు వెంకట్, చిందాడ సోములమ్మ, కూటమి నాయకులు ఆడారి గోవింద, జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీరాముని పెళ్లిరాట



తిమ్మాపురంలో పెళ్లిరాట వేస్తున్న గ్రామస్తులు

**ఎస్.రాయవరం:** శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా తిమ్మాపురం సీతారామాలయం వద్ద బుధవారం పెళ్లి రాట వేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళల సమక్షంలో స్వామి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రామాలయం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో తాంబూలాలు ఇచ్చి స్వామి కల్యాణానికి కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి



పి.కె.పల్లిలో జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

**కోటవురట్ల:** రైతు సేవా కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసి జీడి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పి.కె.పల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం రైతులతో కలిసి సీపీఎం నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అప్పలరాజు మాట్లాడుతూ పొగమంచు కారణంగా జీడిరైతుకు అపార నష్టం వాటిల్లిందన్నారు. పూత నుంచి పిందె నిలబడేంత వరకు రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారని, పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలన్నారు. దీనికి తోడు జీడిపిక్కల వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో 80 కిలోల బస్తాకు రూ.16 వేలు చెల్లించి ప్రభుత్వమే రైతుల నుంచి జీడిపిక్కలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. అనంతరం సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, ఎస్.కొండబాబు, పోతురాజు, దేవా పాల్గొన్నారు.

## 160 మందికి వైద్య పరీక్షలు

**ఎస్.రాయవరం:** ఎముకల పటుత్వంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పెదగుమ్ములూరు శ్రీవెంకటేశ్వర పోలీ క్లినిక్ వైద్యుడు అనిల్‌వర్మ సూచించారు. పెదగుమ్ములూరులో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఎముకల పటుత్వ పరీక్ష, బీఎండీ నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. విలువైన వైద్య పరీక్షలు చేసి సుమారు 160 మంది రోగులకు మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరానికి పీఆర్‌టీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు, స్థానిక ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్ సీతారామరాజు, తదితరులు సహాయ సహకారాలు అందించారు.



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

## ఖరీఫ్ పంటకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

**పాయకరావుపేట:** రైతులందరూ ఖరీఫ్ పంట కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.మోహన్‌రావు సూచించరాఉ. ఆయన పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో 5 మండలాల వ్యవసాయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశం ఉన్న చోట అపరాలు, నువ్వులు, రాగులు పండించే విధంగా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రాయితీలపై పరికరాలు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు రాజ్‌కమాల్, ఆదినారాయణ, ఉమా ప్రసాద్, సరోజిని, చిరంజీవిరావు, ఏఈవోలు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రావు

## కార్పొరేట్ మోజులో పడొద్దు..

**కోటవురట్ల:** ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు విద్యార్థుల ఇంటిబాట పట్టారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యతతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తున్నామని, మీ పిల్లలను చేర్పాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో చేర్పాలని కోరారు. కరపత్రాలు పంచి ఆహ్లాద వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నామని, పిల్లల బంగారు భవిత కోసం చేర్పాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ కళాశాలల మోజులో పడి అప్పులపాలవ్వద్దని సూచించారు.



కోటవురట్లలో ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరుతున్న అధ్యాపకులు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఎస్.రాయవరం:** కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం, సర్వసిద్ధి, లింగరాజుపాలెం, వేమగిరి, పేటసూధిపురం, వాకపాడు, జేవీపాలెం, సైతారుపేట, బసవపాడు, కర్రివానిపాలెం, వెంకటాపురం గ్రామాలకు, వమ్మవరం, గెడ్డపాలెం, కొరుప్రోలు వ్యవసాయ మోటార్లకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం



**సాక్షి, అనకాపల్లి:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యలమంచిలి నియోజకవర్గ పరిధిలో మండల కమిటీల నియామకం చేపట్టారు. ఈ మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ రాంబిల్లి మండల అధ్యక్షుడిగా పిన్నమరాజు రాధా సుందర సుబ్బరాజు, ఉపాధ్యక్షులుగా గెదల శ్రీను, ఎర్రిపిల్లి గంటలరావు, ప్రధాన కార్యదర్శులుగా పిల్లి శ్రీను, దూళి సూర్యచంద్ర, పండల శ్రీనివాసరావు, చేపల చిట్టిబాబు, కార్యదర్శులుగా లాలం శ్రీరామమూర్తి, కొల్లు సత్య, బోడిపల్లి శ్రీను, ప్రగడ శ్రీనివాసరావు, వియ్యపు చిరంజీవి, సభ్యులుగా మడగల భాస్కరరావు, నేమాల శంకరరావు, మంతిన శ్రీను, గొల్లవిల్లి సాయికుమార్, కర్రి రాము, ఎస్.రాజ్యలక్ష్మి, కరణం మోహన్‌రావు, కె.నాగరాజు, మొల్లి లక్ష్మి, వేగి శివశంకర్, కిరింపల్లి శ్రీనివాసరావు, చందక శ్రీను, దూళి లక్ష్మి, సిర మహాలక్ష్మి, కరణం చిరంజీవి, అనకాపల్లి నాగరాజు, లాలం రాజుబాబు, లాలం మురళి, కట్టా వెంకటేష్, మయలపల్లి గోవింద్, సమితాల గోవింద్, కరణం శ్రీను, బడ్డి ఆనంద్, బొందలపు నరసింహమూర్తి, కిల్లాడ అప్పారావు, మైలపల్లి అప్పలనర్స, బొడిపల్లి అప్పారావు, ధర్మాల శ్రీనివాస్, జల్లి గోవింద్, బడ్డి ములస్వామిను నియమించారు.

**మునగపాక:** వైఎస్సార్‌సీపీ మునగపాక మండల అధ్యక్షుడిగా ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా ద్వారం జానకీరామ్, మళ్ల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శులుగా మళ్ల కృష్ణ, మళ్ల జోగినాయుడు, ఆడారి వెంకట గణేశ్వరరావు, తుట్టా వెంకటప్పారావు, కోశాధికారిగా మళ్ల ఈశ్వరరావు, కార్యదర్శులుగా కోన నాయుడు, చీరా జోగినాయుడు, కాండ్రేగుల కృష్ణారావు, మూకా సంతోష్‌రెడ్డి, సరిసా శ్రీనివాసరావు, పుట్టా సంతోష్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా సాలాపు నరసింగరావు, మద్దాల లక్ష్మీ రాధిక, నమ్మి చిరంజీవి, పెతకంశెట్టి హరీష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కర్రి రాము, కరణం కాంతమ్మ, పిట్టా అచ్చియ్యమ్మ, గిడుతూరు యేసు, శరగడం పరదేశినాయుడు నియమితులయ్యారు.

**అచ్యుతాపురం రూరల్ :** వైఎస్సార్‌సీపీ అచ్యుతాపురం మండల కమిటీ నియామకం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడిగా దేశంశెట్టి శంకరరావు, ఉపాధ్యక్షులుగా ధర్మిరెడ్డి నాయుడుబాబు, పంచదార్ల పైడిరాజు, జనరల్ సెక్రటరీలుగా వాసుపల్లి శ్రీనివాసరావు, శనివాడ జువ్వలనాయుడు, శరగడం పరశురామ్, ధర్మిరెడ్డి సత్య, సెక్రటరీలుగా రాజాన నాయుడుబాబు, మోటూరు శ్రీకాంత్, పిల్లి సత్తిబాబు, రెడ్డి నర్సింగరావు, పండల వెంకట రమణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చేపల శ్రీరాములు, మామిడి శ్రీను, బుద్దా నాగేశ్వరరావు, చందక ఆదినారాయణ, సేనాపతి కాశీనాయుడు, మళ్ళ బుజ్జి, పిల్లా రమాకృష్ణ, జాగారపు అప్పలనాయుడు, నడిపింటి శేఖర్, కొవిరి దేముడు, పంచదార్ల చిన్న, గొర్లి సూకరాజు, దుంగా రమణ, కట్టుమూరి శ్రీను, పిల్లి వెంకటరమణను నియమించారు.

**యలమంచిలి పట్టణ కమిటీ ఎంపిక**

**యలమంచిలి రూరల్:** వైఎస్సార్ సీపీ యలమంచిలి పట్టణ కమిటీ వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం విడుదల చేసింది. అధ్యక్షుడిగా బొద్దపు యర్రయ్యదొర, ఉపాధ్యక్షులుగా పిళ్లా గోవింద, అయ్యలనాయుడు, మడగల సూర్య సత్యనారాయణ, జనరల్ సెక్రటరీలుగా కర్రి సత్య శ్రీనివాస్, పక్కుర్తి శంకర్, శానాపతి విజయ్‌కుమార్, కోశాధికారిగా బొత్స శ్యామల, కార్యదర్శులుగా గొంపాన అప్పలనర్స, అక్కిరెడ్డి నర్సింగరావు, తుంపాల లక్ష్మి, లొట్ల శంకర్, కడిమి అప్పలరాజు నియమితులయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా దేవవు కనకలక్ష్మి, కొర్రా సూకరాజు, రాపేటి లక్ష్మి, పల్లా సంతోషి, కొత్తలంక చంద్రశేఖర్, పిళ్లా లక్ష్మి, శానాపతి ధనలక్ష్మి, తీడ సత్యవతి, ఆడారి ఉమా మహేశ్వరరావు, గాపలాపల్లి వీరలక్ష్మి, చిట్టి వెంకట రమణ, కిల్లాడి సత్తిబాబు, నర్మాల భాస్కరరావు, సిరసపల్లి గోవింద్, షేక్ వల్లీ నియమితులయ్యారు. వీరందరికీ పలు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆటిజంపై అవగాహన అవసరం

**నక్కపల్లి:** ఆటిజంపై అవగాహన అవసరమని ఎంఈవో కుంచం నరేష్ అన్నారు. నక్కపల్లిలోని భవిత కేంద్రంలో ఆటిజంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజం బాధితులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించడంతో పాటు కొన్ని ప్రత్యేక ముందస్తు చర్యలు ద్వారా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. వైద్యుల సలహాల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుంటే సమస్య నుంచి పిల్లలను కాపాడుకోవచ్చన్నారు. ఫిజియోథెరపిస్ట్ సిహెచ్.అనూష మాట్లాడుతూ పిల్లల్లో ఎదుగుదల విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోజూ తినే ఆహారంలో కార్బోహైడ్రేట్లు, విటమిన్లు తగిన మొత్తంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కాలిఫ్లవర్, ఆకుకూరలు, కాయగూరలు, గుమ్మడి విత్తనాలు వంటివి పిల్లల ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. ఆటిజంను వ్యాధిగా పరిగణించడానికి వీల్లేదన్నారు. ఈ కార్యక్రమంలో గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయిని యాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లి భవిత కేంద్రంలో మాట్లాడుతున్న ఎంఈవో నరేష్

**పాయకరావుపేట:** అంతర్జాతీయ ఆటిజం అవగాహన నెల కార్యక్రమాల్లో భాగంగా స్థానిక పీహెచ్ వాడ భవిత సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎంఈవో–2 రమేష్‌బాబు అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, శ్రీను, ప్రత్యేక ఉపాధ్యాయులు విజయ్ కుమార్, క్రాంతి కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

## రీ–సర్వేతో రైతులకు మేలు



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

**మునగపాక:** రీ–సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని టి.సిరసపల్లిలో బుధవారం రీ–సర్వేను ఆయన ప్రారంభించారు. ముందుగా రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రీ–సర్వేలో లోపాలను సవరించడంతో పాటు రైతుల రికార్డుల పరిశీలన జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, రీ–సర్వే డీటీ పడాల్, బాలు, నవీన్, వీర్వో తరుణ్, పంచాయతీ కార్యదర్శి హేమకుమారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఘనంగా మహిళా దినోత్సవం

**అచ్యుతాపురం రూరల్ :** అచ్యుతాపురంలో నూతనంగా ఏర్పడిన ఆర్య వైశ్య వనితా సంఘం ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు బండారు లక్ష్మి అధ్యక్షతన సుమారు 400 మంది మహిళలు హాజరై సందడి చేశారు ఆటల పోటీలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమలాకుమారి, మోసయ్యపేట సర్పంచ్ భార్య పంచదార్ల సంధ్య, పంచదార్ల అచ్యుత, బి.లక్ష్మి, ఎస్.ప్రభ, హరిణి, ధనలక్ష్మి, లక్ష్మీపార్వతి, రాధ, ఎస్.ఎస్.లక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### 'సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలి'

**అచ్యుతాపురం రూరల్ :** తమిళనాడు రాష్ట్రం మధురైలో ఈ నెల 6న జరగనున్న సీపీఎం 24వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు కె.రామసదాశివరావు కోరారు. ఈ సందర్భంగా బుధవారం హరిపాలెంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించనున్నట్టు చెప్పారు. పార్టీ నాయకులు కర్రి అప్పారావు, రొంగలి రాము, బుద్ద రంగారావు, రామ్‌కుమార్, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.